క్లుప్తంగా

దసరా కానుకగా ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

సత్తెనపల్లి: దసరా సందర్భంగా పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని శుక్రవారం కోరారు. గత పీఆర్సీ, డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్‌కు సంబంధించిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2024 జనవరి, జూలై మాసాలకు సంబంధించిన రెండు డీఏలు దామాషా పద్ధతిన విడుదల చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జీవితాల్లో విజయ దశమి వెలుగులు నింపాలన్నారు.

విద్యుత్ శాఖ సత్తెనపల్లి టౌన్ ఏఈగా కిరణ్ కుమార్



ఏడీఈ రాజశేఖర్‌బాబుకు ఉత్తర్వులు అందిస్తున్న ఏఈ సుచరిత



సత్తెనపల్లి: విద్యుత్ శాఖ సత్తెనపల్లి టౌన్ ఏఈగా పీబీ కిరణ్ కుమార్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు విద్యానగర్ సెక్షన్ డీ–11 లో విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ ఏఈగా పని చేస్తూ ముప్పాళ్ళ మండలానికి అదనపు ఏఈగా పనిచేస్తున్న పి.రవికిరణ్‌ను అమరావతి ఏఈగా బదిలీ చేశారు. నరసరావుపేట డివిజన్ కార్యాలయంలో కమర్షియల్ ఏఈగా పని చేస్తున్న సుచరితను ముప్పాళ్ళ ఏఈగా నియమించారు. శుక్రవారం ఇద్దరు ఏఈలు సత్తెనపల్లిలో ఏడీఈ రాజశేఖర్ బాబును కలిశారు. ఏఈ సుచరిత ఉత్తర్వులను అందించారు.

30 వరకు ఈ-కేవైసీ గడువు

నకరికల్లు: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలకు ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి, మిర్చి, పత్తి, శనగ, అపరాలు సాగుచేస్తున్న రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వెంటనే ఈ–కేవైసీ పూర్తి చేయాలన్నారు. దీంతో ప్రభుత్వం రైతులకు అందజేసే సంక్షేమ పథకాలకు అర్హత పొందాలని పేర్కొన్నారు.

పాఠశాల పరిశుభ్రతకు ప్రతిజ్ఞ



రాజుపాలెం: పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దళిత బహుజన రిసోర్స్ ఏరియా కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం పేర్కొన్నారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల, కేజీబీవీలో పరిశుభ్రతపై విద్యార్థులతో శుక్రవారం ప్రతిజ్ఞ నిర్వహించారు. గణపవరం పాఠశాల హెచ్ఎం సుగుణమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతే కాకుండా పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదకూరపాడు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



పెదకూరపాడు (అమరావతి): పెదకూరపాడు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.గిరి బాబు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో వట్టిచెరుకూరు, అమృతలూరు, తాడేపల్లిలో ఎస్ఐగా ఆయన పనిచేశారు. మండల పరిధిలో శాంతిభద్రతలు కాపాడటానికి ప్రజలతో మమేకమై, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని చెప్పారు.

సిగ్నల్ వైరు చోరీపై కేసు నమోదు

ముప్పాళ్ళ: మండలంలోని నార్నెపాడు గ్రామ సమీపంలోని టెలిఫోన్ టవర్‌కు సంబంధించి సిగ్నల్ కాపర్ వైర్ చోరీకి గురైందని కంపెనీ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 162 మీటర్లు పొడవు గల తొమ్మిది వైర్లు చోరీకి గురైనట్లు తెలిపారు. ఇండస్ టవర్స్ సిబ్బంది గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో కంపెనీ ప్రతినిధి సీహెచ్ ప్రవీణ్ కుమార్ చోరీపై ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని విలువ రూ.48వేల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వరద బాధితులకు విరాళం అందజేత

సత్తెనపల్లి: వరద బాధితుల సహాయార్థం ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు రూ.4 లక్షల విరాళాలు సేకరించారు. నగదు చెక్కును శుక్రవారం సీఎం చంద్రబాబును కలిసి అందజేసినట్లుగా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మంచాల రమేష్ తెలిపారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అచ్చంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీఎస్సార్ జెడ్పీ హైస్కూలులో పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో గురువారం కబడ్డీ, వాలీబాల్, యోగాసనాల పోటీలు జరిగాయి. హెచ్ఎం చిగురుపాటి కల్యాణి ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో ఐదు మండలాల నుంచి 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయి జట్లను ఎంపిక చేసినట్లు పాఠశాల పీడీ ఆలపాటి సుజాత తెలిపారు. త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

జీఆర్‌సీఆర్‌కే విద్యార్థుల ప్రతిభ

పెదకూరపాడు(అమరావతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అచ్చంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటారు. 58 మంది నియోజకవర్గ స్థాయి జట్లకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో వాలీ బాల్ జట్లకు బాలబాలికలు 18 మంది, అండర్–14 విభాగంలో బాలికలు 9, బాలురు ముగ్గురు ఎంపికైనట్లు చెప్పారు. కబడ్డీలో అండర్–17 బాలికలు 9, బాలురు ఇద్దరు, అండర్ –14 విభాగంలో బాలికలు 9 మంది, బాలురు ఇద్దరు, బ్యాడ్మింటన్‌లో అండర్–17, 14 బాలుర విభాగం సింగిల్స్ పోటీలకు ఇద్దరు, బాలికల డబుల్స్‌లో అండర్–17, 14 విభాగాల్లో జట్లు ఎంపికైనట్లు చెప్పారు. శుక్రవారం పాఠశాలలో క్రీడాకారులను డైరెక్టర్ గుత్తా కవిత రాములు అభినందించారు.



బాలికల కబడ్డీ పోటీ

కొత్త చట్టాల రద్దు కోరుతూ న్యాయవాదుల నిరసన



సత్తెనపల్లి: న్యాయవాదులు తమ హక్కులు కాపాడుకునేందుకు, ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాల రద్దు కోసం ఉద్యమం చేయాలని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలోని న్యాయ దేవత విగ్రహం ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమంలో రెండో రోజు శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. న్యాయవాదులు రెండో రోజు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రవి, మన్నెం వెంకటేశ్వరావు, నాగూర్ బాబు, న్యాయవాదులు పూజల వెంకట కోటయ్య, కళ్ళం వీర భాస్కర్ రెడ్డి, కాకర్ల నాగవెంకటహరిబాబు, దాసరి జ్ఞాన రాజ్‌పాల్, నరిశేటి వేణుగోపాల్, కొల్లా వెంకటేశ్వరావు, పోతల రవికుమార్, బూతుకూరి రామిరెడ్డి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, చావల బాలకోటయ్య, నల్లిబోయిన ఆంజినేయులు, బొక్క సంగీతరావు, ఆకుల నాగార్జున, ఉడుముల విద్యాసాగర్‌రెడ్డి, భరత్ ఉన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నప్ప

ముప్పాళ్ళ: ప్రతి మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. చాగంటివారిపాలెం రైతు సేవా కేంద్రంలో డీబీఆర్సీ ఆధ్వర్యంలో మహిళా హక్కుల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నప్ప మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకమైన చట్టాలున్నాయని, వాటిని తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు నిరోధక చట్టం, పని ప్రదేశంలో మహిళలకు ఇబ్బందులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకునేలా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, జి.జయలక్ష్మి, డీబీఆర్సీ మహిళా కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ, ఆయా గ్రామాల మహిళా సంరక్షకులు కోటమ్మ, శ్వేత, ఝాన్సీ, మహిళలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వ్యాసరచన పోటీలో విద్యార్థినులు

పెదకూరపాడు(అమరావతి): స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితేనే మనిషి ఆరోగ్య ప్రమాణాలు పెరుగుతాయని కాకతీయ విద్యా సంస్థల కరస్పాండెంట్ డైరెక్టర్ దీవి లలిత బాబు అన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జన చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో పెదకూరపాడులోని కాకతీయ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. లలితబాబు మాట్లాడుతూ కాలుష్య రహిత గ్రామాల్లో ఉండే నిరక్షరాసులు లక్ష్యంగా విద్యావంతులు అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.అశోక్, జన చైతన్య సమితీ కార్యదర్శి అన్నవరపు స్టాలిన్‌బాబు, అధ్యాపకులు షేక్ కరీం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

బెల్లంకొండ: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే రక్త హీనతను నివారించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.ఉమాదేవి తెలిపారు. మండల కేంద్రంలోని కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తం శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీ సులోచన, కళాశాల అధ్యాపకులు శారదా దేవి, వై.రమేష్ బాబు, సత్యప్రభ, కుసుమకుమారి, రత్నకుమారి, బాలు నాయక్, నరసింహారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రాజుపాలెం: బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో టి.శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బాలికలకు మండల స్థాయి అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల అనారోగ్య పాలవుతారని తెలిపారు. ఆకు కూరలు, చిరు ధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను తీసుకోవాలని సూచించారు. రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్ మాట్లాడుతూ బాలికలు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపిన విధంగా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడరన్నారు. ఎంఈవో–2 నరసింహారావు, ఏసీడీపీవో టి.సంతోషకుమారి, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్కే రమాదేవి, బి.ప్రసన్నరాణి, ఎస్.స్వర్ణలత పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సత్కారం



సత్తెనపల్లి: సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బి.అశోక్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన దేవానంద్ దుగ్గిరాల బదిలీ అయ్యారు. అశోక్ కుమార్ గురజాల సబ్ రిజిస్ట్రార్ పనిచేశారు. పలువురు ఆర్యవైశ్య నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, సత్కరించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వర్లు, జెమిలి రాధా, డి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు

అచ్చంపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి పిలుపు మేరకు, తిరుపతి లడ్డూ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న దుశ్చర్యలను ప్రక్షాళన చేయాలని మండలంలోని ప్రతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేయాలని పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అచ్చంపేటలోని హరిహర క్షేత్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే పూజా కార్యక్రమంలో వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వేంకటేశ్వరస్వామి భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రాజుపాలెం: ఎంపీడీఓ కార్యాలయంలో విద్యార్థులకు శుక్రవారం స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమంపై మండల స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఇనిమెట్ల, రాజుపాలెం, గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని ఎంఈవో–2 నరసింహారావు తెలిపారు. వ్యాసరచనలో గణపవరం పాఠశాల విద్యార్థులు ఎం.హరిణి, కె.సంజన, ఎం.హాసినలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని చెప్పారు. వకృత్వంలో ఇనిమెట్ల విద్యార్థి వై.లక్ష్మీకుమారి ప్రథమం, రాజుపాలెం విద్యార్థి ఎస్.నవ్య ద్వితీ, గణపవరం విద్యార్థి కె.యస్వంతి తృతీస్థానం సాధించిరాని, వారికి త్వరలో బహుమతులు అదిస్తామని తెలిపారు.

'పీఎం సూర్య ఘర్' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు

బెల్లంకొండ: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియోగదారులకు కిలో వాట్ సామర్థ్యాన్ని బట్టి సోలార్ ప్యానల్స్‌ను సబ్సిడీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. సోలార్ ద్వారా వినియోగదారులే విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు. గృహ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను వినియోగించుకుని, మిగిలిని విద్యుత్ తిరిగి విద్యుత్ గ్రిడ్‌కు విక్రయించుకుని నగదు పొందవచ్చని తెలిపారు. పథకానికి సంబంధించి పూర్తి వివరాల కోసం లబ్ధిదారులు స్థానిక విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఆయన వెంట స్థానిక ఏఈ పవన్ కుమార్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

నేడు శ్రీవారికి పూజలు

సత్తెనపల్లి: సీఎం చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ బాధ్యులు శుక్రవారం తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ హాజరవుతారన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా రాజకీయ దుర్బుద్ధితో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. దేవాలయంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి జరిగే పూజలో శ్రేణులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు వకృత్వ పోటీలు

నాదెండ్ల: స్వర్ణాంధ్ర ఫౌండేషన్ 2047లో భాగంగా శుక్రవారం యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. వకృత్వంలో సింగిల్స్ పోటీల్లో యశస్వి (లింగారావుపాలెం), లిఖితసాయి (ఉన్నవ), సానియామీర్జా (జగ్గాపురం), వకృత్వం టీమ్ ల్లో యశస్వి (లింగారావుపాలెం), మోహన్‌అర్చన (లింగారావుపాలెం), ఎం.రాజు, కె.మనోహర్ (కారుచోల) మూడో బహుమతి గీతాశ్రీలక్ష్మీ, వెన్నెల (సొలస), వ్యాసరచనలో వేణుమాధవ్ (ఉన్నవ), గీతాశ్రీలక్ష్మి (సొలస) సాయికృష్ణ (జగ్గాపురం) బహుమతులు సాధించారు.

సొమ్ము చెల్లించకుంటే రికవరీ యాక్ట్ అమలు



నాదెండ్ల: నేషనల్ హైవే బైపాస్ నిర్మాణానికి భూసేకరణ చేసిన సమయంలో ప్రభుత్వం చెల్లించిన అదనపు పరిహారం సొమ్మును 15 రోజుల్లో ఖజానాకు జమచేయకుంటే చట్టప్రకారం రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేస్తామని తహసీల్దార్ ఏపీ రమణ చెప్పారు. గణపవరం గ్రామానికి చెందిన రైతు బి.వెంకటేశ్వర్లుకు గతంలో ప్రభుత్వం అదనపు పరిహా రం చెల్లించిందని, ఆయన మృతి చెందినందు న ఆయన వారసురాలైన భార్య నాగేంద్రమ్మ పరిహారం సొమ్ము తిరిగి జమ చేయాలన్నారు. ఇప్పటికే వారికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతో రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గణపవరం గ్రామంలోని సంబంధిత రైతు పొలంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది బోర్డును ఏర్పాటు చేశారు.

నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మించాలి



నరిశేటి వేణుగోపాల్

సత్తెనపల్లి: స్థానికంగా ప్రస్తుతం ఉన్న వివిధ కోర్టుల భవనాలు శిథిలావస్థలో, మరికొన్ని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో వేర్వేరు చోట్ల ఉన్నాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ అన్నారు.. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కక్షి దారులు, న్యాయవాదులు, న్యాయవాది గుమాస్తాలు, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం తక్షణమే అన్ని కోర్టులు ఒకే చోట ఉండేలా 'నూతన కోర్టు కాంప్లెక్స్'(భవనాలు) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తాలూకా సెంటర్‌లోని పాత కోర్టు స్థానంలోనే నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మించడానికి, విస్తరించడానికి తగిన స్థలం అందుబాటులో ఉందన్నారు. పాత తహసీల్దార్, ఉప ఖజాన అధికారి కార్యాలయాల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఇప్పటికే నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం జరిగి అందులోనే కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయన్నారు. పాత తహసీల్దార్ కార్యాలయం నిరుపయోగంగా ఉందన్నారు. ట్రెజరీ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేసేందుకు ఇప్పటికే శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. పాత కోర్టు ప్రాంగణంతో పాటు పాత తహసీల్దార్, ట్రెజరీ, ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాల స్థలాలను సమీకరిస్తే 'నూతన కోర్టు కాంప్లెక్స్' నిర్మించడానికి సరిపడా స్థలం అందుబాటులోకి వస్తుందన్నారు. కోర్టు భవనాలు సముదాయానికి కావలసిన పరిపాలన అనుమతులు, నిధులు మంజూరుకు న్యాయశాఖ, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయులు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సత్తెనపల్లిలో రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు

సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆరుగురు బదిలీ కాగా.. కేవలం ఇద్దరిని మాత్రమే నియమించారు. నలుగురి భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఉన్న ఉద్యోగులపై పని భారం పడనుంది. మండల డిప్యూటీ తహసీల్దారుగా ఎస్.రవి కుమార్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిలకలూరిపేట నుంచి ఆయన ఇక్కడికి రానున్నారు. ప్రస్తుత డీటీ బి.రాజేంద్ర ప్రసాద్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. సత్తెనపల్లి పౌర సరఫరాల డీటీ కె.అరుణాదేవిని డీఎస్ఓ కార్యాలయ స్పెషల్ డీటీగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఎవరిని నియమించలేదు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల విభాగం) ఆర్.వెంకటేశ్వర్లు నాయక్‌ను కారంపూడి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కూడా ఎవరిని పంపలేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.ఆదియ్యను నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కూడా ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో రెండు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీనియర్ అసిస్టెంట్‌గా బి.సుబ్బారావును స్థానిక ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కలెక్టరేట్ నుంచి షేక్ జిలాని బాధ్యతలు స్వీకరించనున్నారు. సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న కె.వెంకటేశ్వర్లను అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

జాషువాకు ఘన నివాళులు



జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



జాషువా చిత్రపటానికి నివాళి

అమరావతి: తన రచనలతో సమాజ అభ్యున్నతికి తోడ్పడిన గుర్రం జాషువాకు శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో అమరావతి కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సీనియర్ నాయకుడు గుంటుపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ జాషువా చిన్న వయసు నుంచే అనేక అవమానాలు ఎదుర్కొని, సామాజిక అంశాలను తన సునిశిత దృష్టితో పరిశీలించి, సామాజిక కవి కోకిల నిలిచారన్నారు. తన రచనలతో కళాకారుల గళాలకు ఊపిరి పోసిన విశ్వనరుడు గుర్రం జాషువా అని అన్నారు. సీఐటీయూ కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ విశ్వ కవి గుర్రం జాషువా కులాధి పత్యాన్ని ఎదిరించి, కవిగా ఎదిగి తన రచనలతో అంటరానితనం, బాల్య వివాహాలు, మహిళలపై దాడులు, కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం రగిలించారన్నారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘనాయకుడు దారా ప్రసాదు, సయ్యద్ మొహిద్దీన్, తోకల సూరిబాబు, ఎం.సుబ్రహ్మణ్యం వెంకటేశ్వరరాజు సీహెచ్ మురారి, తల్లం ప్రదీప్ పాల్గొన్నారు.

అసమానతలపై జాషువా పోరాటం

క్రోసూరు: గుర్రం జాషువా జయంతి ఉత్సవాలు శుక్రవారం ఆమంచి విజ్ఞానం కేంద్రంలో, భవన్ కన్వీనర్ తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన జరిగాయి. జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. కళాకారుల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు బోళ్ళ నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అసమానతలపై కవిత్వం ద్వారా జాషువా పోరాడన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిలక ఏషయ్య, మల్లికార్జునరావు , టి.అనూష, కత్తుల గోపికృష్ణారెడ్డి , నరసింహారావు పాల్గొన్నారు.

సమాజ సమానత్వానికి జాషువా కృషి

సత్తెనపల్లి: సమాజంలో అంతా సమానమేనని కవితలు, రచనల ద్వారా నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పోరాటం చేశారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు గార్లపాటి దాసు అన్నారు. గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్‌లో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జాషువా చిత్రపటానికి పూలమాలలు, వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ గుర్రం జాషువా పల్నాడు జిల్లా, వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి చిలకా భాస్కర్‌రావు, మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, బెల్లంకొండ అధ్యక్షుడు వీర బ్రహ్మం, రాము, సలాము, కంటిపూడి నాని పాల్గొన్నారు.

పెదకూరపాడు(అమరావతి): నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆనందపేటలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పెదకూరపాడు మండల చర్మ కారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గార్లపాటి దాసు మాట్లాడుతూ గుర్రం జాషువా జిల్లాలోని వినుకొండ మండలం చాట్రగడ్డ పాడులో జన్మించారని చెప్పారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొని, సమాజ దాష్టికాన్ని కలంతో చీల్చిన అక్షర యోధుడు గుర్రం జాషువా అన్నారు. చర్మకారుల సేవా సంఘం పెద్దకూరపాడు నియోజకవర్గ కన్వీనర్ చిలకా భాస్కరరావు, పెదకూరపాడు, బెల్లంకొండ మండలాల అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు, కొదమల బ్రహ్మం తాళ్లూరి చింతయ్య, బంక కోటేశ్వరరావు, బంక పాల్ పాల్గొన్నారు.

బస్సులకు నిషేధం..ఇసుక లారీలకు ఆహ్వానం



పెదమద్దూరు బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న ఇసుక లారీ

అమరావతి: ప్రఖ్యాత పర్యాటక కేంద్రం అమరావతికి విజయవాడ నుంచి రావాలంటే అధ్వాన రోడ్డులో ఆపసోపాలు తప్పవు. దీనికి తోడు పెద మద్దూరు వద్ద వాగుపై లో–లెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. దీంతో బస్సు సర్వీసులను ఆర్టీసీ రద్దు చేసింది. రెండు రోజులుగా బ్రిడ్జికి ఇవతలి వరకు బస్సులను నడుపుతున్నారు. అక్కడ దిగిన ప్రయాణికులు 500 మీటర్ల దూరం నడిచి మరలా పెద మద్దూరులో విజయవాడ వెళ్లేందుకు బస్సు ఎక్కేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయం చూపారు. అయితే శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని పరిశీలించిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు బ్రిడ్జిపై నుంచి రాకపోకలను నిషేధించారు. కానీ, తుళ్లూరు మండలం నుంచి అమరావతి వైపు భారీ ఇసుక లారీలు ఈ బ్రిడ్జిపై నుంచి రెండు రోజులుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇది గమనించిన మండల ప్రజలు భారీ ఇసుక లారీలకు లేని నిషేధం..ఆర్టీసీ బస్సులకెందుకని ప్రశ్నిస్తున్నారు. కేవలం బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని బోర్డు ఏర్పాటు చేసి.. ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు. బ్రిడ్జిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.